
# ఉభయ భ్రష్టులు



అవును, నేను ఉభయభ్రష్టుణ్ణే. కాని నేను జరిగినదానికి ఏమాత్రమూ పశ్చాత్తాపపడటంలేదు. ఎందుకు పడటంలేదా అని ఎంతో ఆలోచించుకున్నాను. కాని లాభం లేకపోయింది. మీ కెవరికన్నా తెలిస్తే దయచేసి చెప్పండి. నా కథ ఉన్నది ఉన్నట్టు చెబుతాను.

మాది ధనికకుటుంబమూ కాదు, దరిద్రపు కుటుంబమూ కాదు. మాకు ఉన్నంతలో సుఖంగా జరిగిందనే అనుకుంటున్నాను. మాది పెద్దఇల్లేకాని, డాబా ఇల్లు కాదు, పెంకుటిల్లు. మేం ఎలెక్ట్రిక్ ఫాన్లూ, ఏర్‌కండిషన్లూ, సోఫాసెట్లూ, ఫ్రిజిడేర్లూ ఎరగం. మాకు కారు లేదు. నాకుమాత్రం ఒక సైకిలుండేది. అదైనా మూడేళ్ళు పోరుపెట్టాకగాని మా నాన్న కొనివ్వలేదు. "ఎందుకురా సైకిలూ? మొలలొస్తాయి. నడిచినంత ఆరోగ్యం మరోటి లేదు. దేవుడు కాళ్ళిచ్చింది సైకిలు తొక్కటానికిట్రా?" అనేవాడు నాన్న.

నాన్న పిసినిగొట్టులాగా ప్రవర్తించాడుగాని, నిజానికి పిసినిగొట్టు కాదు. మా సుశీలకు పెళ్ళిచెయ్యాలన్న ఆలోచన వచ్చినప్పటినుంచీ ఆయనకు డబ్బు ఖర్చు చెయ్యటమంటే భయం పట్టుకున్నది. కట్నాలు కుమ్మరించందీ ఆడపిల్లకు పెళ్ళి కాదు.

కట్నాలను విరసిస్తూ వెయ్యి వ్యాసాలు రాయండి గాక, వాటన్నిటికన్నా మా నాన్న వాలుగేళ్ళు పడిన మనోవ్యథ వాస్తవమైనది. ఉన్నదే ఒక్క కూతురు. దానికి వీలైనంత మంచి సంబంధం తీసుకురావటం తప్ప ఆయన కింకొక జీవితాశయం ఉన్నట్టు కనిపించలేదు.

ఆ మాటకొస్తే నేనూ ఆయనకు ఏకపుత్రుణ్ణే. నేను పెద్ద చదువు చదవటంకూడా ఆయనకు ముఖ్యమనే తోచిఉండవచ్చు. కాని నేను ఇంటరు పూర్తి చెయ్యగానే నాన్న నాతో, "సోపి, నువ్విహ చదువు మానేసి ఏదన్నా ఉద్యోగం చూసుకుంటావేమిట్రా?" అన్నాడు. ఆయన ఆ మాట ధైర్యంగా అనలేదు. ఏదో తప్పు చేస్తున్నవాడల్లేనే అన్నాడు.

నాకు చప్పున కడుపులోనుంచి పుట్టెడు దుఃఖం ఉబికివచ్చింది. ఆ మాటే మా అమ్మ అంటే కోపంతో చిందులు తొక్కిఉండేవాణ్ణేనుకుంటాను.

"ఏమో . . . నీ ఇష్టం . . ." అని, ఇంకేమీ అనలేక అక్కడినుంచి వెళ్ళిపోయాను.

తరవాత అమ్మతో, "నాన్న ఏమన్నాడో తెలుసా?" అన్నప్పుడు నా కళ్ళవెంబడి నీరు ఆగలేదు. పెల్ఫ్ పిటీ వచ్చేసింది.

అమ్మ నాన్నతో పెద్ద పోట్లాట వేసుకుంది. "వాడు కష్టపడి చదివి ఫస్టుక్లాసు తెచ్చుకుంటే, వాడి చదువు మానిపించి వాణ్ణి పోస్టుజవాను చేద్దామనా, పోలీసుజవాను చేద్దామనా? వాడి సంపాదన లేకుండా జరగనంత దరిద్రం మనకు చుట్టుకుందా ఏమిటండీ? రాగా, రాగా ఇటువంటి ఆలోచనలు వస్తున్నయ్యేమిటి మీకు!" అని అమ్మ దులుపుతుంటే నాన్న చాలా బాధపడ్డాడు.

"చదువు మానమని నేను అనలేదే! మానుతావా అని అడిగాను. కాదు, కూడదు, చదువుకుంటావంటే నేను వద్దనా అన్నాను?" అన్నాడు నాన్న.

"అసలు అటువంటి ఆలోచ నెందుకు రావాలంట! అదేం ఆలోచన, పాపిష్టి ఆలోచన!" అన్నది అమ్మ.

"బరువు మోసేవాడికి తెలుస్తుంది. వచ్చే ఏడు కాకపోతే పై ఏటికైనా పిల్ల పెళ్ళి చెయ్యాలి గదా! ఎవరిని కదిలించినా ఎన్నివే లిస్తావనేవాడే!" అన్నాడు నాన్న.

వాళ్ళిద్దరి వాదననూ సుశీల సునాయాసంగా కట్టించేసింది.

"నీకేమన్నా పిచ్చా ఏమిటి, నాన్నా? నాకింకా పదహారు వెళ్ళలేదు. అప్పుడే నా పెళ్ళి గురించి దిగులు పడుతున్నావేమిటి? నాకన్న ఏడేళ్ళు పెద్దది వాళ్ళ ఇందిర. నిక్షేపంగా ఎమ్మే చదివేస్తున్నది. పెద్దవాళ్ళు పెళ్ళిమాటెత్తితే, డాక్టరేటు సంపాదించాక ఆలోచిద్దాం లెమ్మంటుంది. అన్న చదువు పూర్తిఅయి ఉద్యోగం చేసుకునేదాకా నా పెళ్ళిమాట ఎత్తకండి."

సుశీల ఈ మాట అనటం నేను నా జన్మలో మరిచి

పోలేను. ఊనాటు దాన్ని గురించి నాకే అభిప్రాయమున్నా ఉండనివ్వండి — అనా డా మాట అన్న సుశీల ఒక హీరో!

అటువంటి చెల్లెల్ని పెట్టుకుని, దాని అవసరం గురించి నాన్న పడ్డ బెంగలో నూరోవంతుకూడా పడకపోగా, నా చదువు సంగతే ఆలోచించుకున్న నా స్వార్థానికి నేనెంతో సిగ్గుపడ్డాను.

ఆ పశ్చాత్తాపంలో, "పోనీ, నువ్వన్నట్టు నేను చదువు మాని ఓ చిన్న ఉద్యోగం సంపాదిస్తే మనం ఎంత వెనకెయ్యగలుగుతాం, నాన్నా?" అన్నాను.

"నేనేదో మాటవరసకన్న మాటను అంత సీరియస్‌గా తీసుకుంటావెందుకురా?" అన్నాడు నాన్న మరింత బాధగా.

"కాదు, నాన్నా. నేను సీరియస్‌గానే అంటున్నాను. ఏ గవర్నమెంటు జాబ్‌లో అయినా చేరితే ప్రైవేటుగా ఎమ్మేదాకా పాసైపోవచ్చు. రెండేళ్లలో నా చదువు కింద అయ్యే ఖర్చుకు నేను సంపాదించేది జతచేరిస్తే ఓ రెండువేలు కాకపోతుందా?" అన్నాను.

నాన్న కళ్లలో ఒక్కక్షణం మెరుపు మెరిసి వెంటనే ఆరిపోయింది. ఆయన తన అదృష్టంలో నమ్మకం లేనివాడిలాగా, నీరసంగా, తల అడ్డంగా తిప్పుతూ, "ఆ లెక్కలేమీ లాభంలేదులే. ఎట్లా అయితే అట్లాగే అవుతుంది. నువ్వు ఎమ్మేచదవటమేమిటి? ఏ ఇంజనీరో, డాక్టరో అవుతావని అమ్మ కలలు కంటున్నది. అందులో క్లాసుకూడా వచ్చిందేమో, సీటు దొరకటం ఏమంత కష్టం కాదు" అన్నాడు నాన్న.

నిజానికి నా కా రెండు కోర్సులూ ఇష్టంలేదు. డాక్టరయితే రోగాలమధ్య జీవించాలి. డబ్బు సంపాదించవచ్చునేమోగాని, ఏ అర్ధరాత్రి పేషంట్లు పిలిచినా వెళ్ళాలి. ఇంజనీరుకు అటువంటి బాధలు లేవుగాని, నాలుగైదేళ్లపాటు శరీరం హూనం అయిపోతుంది. అందులోనూ నేను అర్భకుణ్ణి.

అయితే ఒకటుంది. నేను డాక్టరయినా, ఇంజనీరయినా బోలెడంత కట్నంతో పిల్లనిస్తారు. ఆ కట్నం సుశీలను చేసుకునేవాడికి ట్రాన్స్‌ఫర్‌చేసి పారెయ్యొచ్చు. నాన్నకు పెద్ద బెడద తప్పిపోతుంది.

సుశీల సంతోషిస్తుందని నా ఈ ఆలోచన దానితో చెప్పాను.

"ఏదో ఒకటి చెయ్యొచ్చులే. ముందు నీ చదువు సంగతి చూసుకో. నా పెళ్లికేమీ తొందరలేదు" అన్నది సుశీల, నాకు ఉత్సాహం సగం చచ్చిపోయేటట్టు.

నేను ఇంజనీరింగులోనే చేరాను. నా కప్పుడు తెలీలేదుగాని, నా చదువుకింద నాన్న కూడబెట్టి ఉంచినదాంట్లోకూడా తొర్ర పడ నారంభించింది. ఎవరికీ చెప్పకుండా నాన్న, పాపం, ఆ డబ్బు ఎంత కాలంగా నిలవచేస్తున్నాడో, అందులో తొర్ర పడ్డందుకు ఎంత బాధపడ్డాడో నేను ఊహించగలను.

అయితే జీవితంలో మన అంచనాలు తారుమారు చెయ్యటానికి ఏదో ఒకటి జరుగుతుంది. నా ఇంజనీరింగు చదువు రెండోఏడు పూర్తికాకముందే మా సుశీలకు రాజాలాంటి సంబంధం వచ్చింది.

కుర్రవాడు సుశీలకన్న బాగా పదేళ్ళు పెద్దవాడే. కాని యునైటెడ్ స్టేట్స్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌లో

**స్వార్థం త్యాగాన్ని కోరుతుంది. త్యాగం సుఖాన్ని బలికోరుతుంది. అటు త్యాగమూ ఫలించక, స్వార్థమూ యోగించకపోతే మనిషి ఉభయ భ్రష్టుడు కాక తప్పదు. ఈ రోజుల్లో ఉభయభ్రష్టు డయినవాడు, అపర సన్యాసి కా నవసరంలేదు. పడ్డ చోటే వెతుక్కుంటే, రవంత సుఖం లభించకపోదు!**

రెండువేలు సంపాదిస్తున్నాడు. ఏడెనిమిదేళ్ల క్రితం ఆ సర్వీసులో చేరాట్ట. చాలా త్వరగా పైకివచ్చాట్ట. కిందటేడు అమెరికా వెళ్ళి అక్కడ రెండునెలో, మూడునెలో ఉండివచ్చాట్ట. సుశీల అందమైన పిల్ల అని మాకూ అతనికీ దూరపుబంధువులైన వాళ్లెవరో చెబితే, వచ్చి సుశీలను చూసి, పిల్ల కభ్యంతరం లేనిపక్షంలో చేసుకుంటానన్నాట్ట.

ఆ అబ్బాయికి యాభైవేలు కట్నం ఇచ్చి పిల్లనివ్వటానికికూడా సిద్ధంగా ఉన్నవాళ్ళున్నారు. కాని తనకు కావలిసింది కట్నంకాదనీ, పిల్లఅనీ, డబ్బు తానే సంపాదించుకోనగలననీ, పెళ్లిమాత్రం గొప్పగా, మంచి స్టయిల్లో జరగాలనీ అన్నాడు.

అతను చెప్పిన స్టయిల్లో పెళ్లి చెయ్యాలంటే ఎంతలేదన్నా పదివేలు ఖర్చయేటట్టు కనిపించింది. మేం పెళ్లికి అంత ఖర్చుచెయ్యలేమంటామనిగాని, "ఈ సంబంధం మాకు నచ్చలేదు" అంటామనిగాని అతనికి తట్టినట్టు లేదు. తాను ఒప్పుకోవటంతో సంబంధం స్థిరమైనట్టే అనుకున్నవాడిలాగా అతను, "నేను వెళ్లి మా నాన్నగారిచేత వివరాలన్నీ రాయిస్తాను. ముహూర్తం కొంచెం వ్యవధి ఉండేటట్టుగానే పెట్టుకుందాం — మీరు ప్రిపరేషన్స్ చెయ్యటానికి వీలుగా" అని చెప్పి అతను వెళ్లిపోయాట్ట.

అతను వెళ్లగానే అమ్మ, "ఈ సంబంధం వొదులుకున్నామో, మనం మన జన్మలో అమ్మాయికి ఇందులో సహం సంబంధంకూడా తీసుకురాలేం! పిల్లే కావాలనే వాడు కోటికొకడుకూడా ఉండడు. అందరూ కట్నాల కోసం ముస్తైత్తే వెధవలే!" అన్నదిట.

పెళ్లిఖర్చులకే పదివేలు పెట్టాలంటే కట్నం పోసి సంబంధం తీసుకువచ్చినట్టేనని అమ్మకు తట్టేఉండదు అయితే రెండువేల జీతగాణ్ణి సంపాదించటం మాబోటి సంసార్లకు సాధ్యంకాదని ఒప్పుకుంటాను.

ఒకే కవరులో నాన్నా, సుశీలాకూడా నాకీ సంబంధం గురించి రాశారు. మిగిలిన విషయాలన్నిటితోబాటు నాన్న, "ఒక్కటే నాకు పాలుపోవటంలేదు. పెళ్లి ఖర్చులకు ఏ పదివేలో అవుతుంది. ఎవరిస్తారో తెలీటం లేదు. సుశీల అదృష్టం ఎట్లా ఉందో అట్లా అవుతుంది. నాలో నాకు విశ్వాసం లేదు" అని రాశాడు.

సుశీల చాలా క్లైప్లీగా ఎవరేమన్నదీ వివరంగా, కథ

**కొడవటిగంటి కుటుంబరావు**

రాసినట్టు రాసింది. చిట్టచివరకుమాత్రం "ఈసంబంధం రాకుండాఉంటే ఒక విధంగా బాగుండేదేమో. కడుపు మాడుతున్నవాడికి అందుబాటులో లేకుండా పంచభక్ష్య పరమాన్నాలు చూపించినట్టయింది మన స్థితి. పెళ్లి ఖర్చులకు ఇల్లూ, పొలమూ తెగనమ్మితేగాని ఈ పెళ్లి జరిగేటట్టు లేదు. ఉన్నది కాస్తా అమ్మేస్తే ఆ తరవాత ఏమవుతాం? నీ చదువు ఇంకా సగంకూడా కాలేదు. ఇదేదో మనకి పరీక్షలాగుంది" అంటూ నిరుత్సాహంగా ముగించింది.

నాలో మళ్లీ స్వార్థం తల ఎత్తింది. సుశీల తనకీ సంబంధం వద్దనీ, ఇంత తలకుమించిన సంబంధం గురించి తమకు ఆలోచించే అర్హతకూడా లేదనీ ఎందుకు రాయలేదూ? జానపద కథల్లో రాజకుమారుడు కాపుల పిల్లను చేసుకుంటానంటాడు; బాగానే ఉంటుంది. కాని వాస్తవజీవితంలో ఈ అంతస్థుల తేడాలు బతికున్నాళ్లూ కట్టికుడుపుతాయే.

నా చదువు కరాబావుతై పోతుందేమోనన్న భయమే నాలో ఈతెలివితేటలన్నీ తెచ్చిపెట్టింది! వాస్తవజీవితంలో నైనా రాజకుమారుడు తనను వలచి వస్తే కాపువాళ్ల పిల్ల కాదు పొమ్మంటుందా? అమ్మ అన్నదిట గద, ఈ సంబంధం మళ్లీ తపస్సుచేసినా రాదని! ఆ మాట నిజం. ఇదే సంబంధం నా కోర్సు అయిపోయాక వస్తే ఏ చిక్కూ ఉండేదికాదు.

సుశీల దీర్ఘ భవిష్యత్తుకన్న నా సమీప భవిష్యత్తు గురించి స్వార్థంతో ఆలోచించుకున్నందుకు చాలా పశ్చాత్తాపపడ్డాను. సుశీలకు ఈ పెళ్లి అయేటట్టు చెయ్యటానికి ఏ కొండలను కదిలించాలా అని ఆలోచిస్తూంటే, అకస్మాత్తుగా నాకు రాజగోపాల్ చెప్పిన విషయం ఒకటి జ్ఞాపకం వచ్చింది.

రాజా నాతోపాటే ఇంజనీరింగు చదువుతున్నాడు. అతని పినతండ్రి పెద్ద కంట్రాక్టరు. లక్షలకు లక్షలు గడించాడు. ఆయనమీద డజన్లకొద్దీ చార్జీలుండేవిట. జీపులో పోతూ, అక్సిడెంటు జరిగి చచ్చిపోయాడు. అదికూడా కిందటేడే జరిగింది.

"మా బాబు దోపిడీచేసి ఇంత సంపాదించాడు. ఎందుకు? ఎవడో తినేస్తాడు ఆ సంపాదన అంతా. ఒక్కతే కూతురు జానకి. కుంటిది. పోలియో వచ్చి కుడికాలు అవుటయిపోయింది. డబ్బుకోసం ఎవడో పెళ్లాడేస్తాడు. వాడి దివిటీ వెలగటానికి మా బాబు అక్రమ సంపాదన పనికొస్తుంది. ఈ జీవితానికి అర్థమేమైనా ఉందా?" అన్నాడు రాజా ఆవేశంతో.

ఆ మాట ఇప్పుడు గుర్తొచ్చింది.

నేను రాజాను కలుసుకుని, "రాజా, మీ బాబు కూతుర్ని నేను వెంటనే చేసుకునేటట్టు ఏర్పాటు చెయ్యగలవా?" అన్నాను.

'ఔర, నీచుడా!' అన్నట్టుగా రాజా నాకేసి చూసి, "ఏం డబ్బుదాహం పుట్టుకొచ్చిందా ఏం?" అన్నాడు.

"అవును. లక్షలన్నీ జానకినే ఉంచుకోనీ. నాకు కావలిసింది పది, పదిహేను వేలే."

ఉన్నదున్నట్టు పరిస్థితి అంతా రాజాకు చెప్పాను. రాజా నా ఉద్దేశం అర్థంచేసుకున్నాడుగాని ఒకంతట సమాధానపడలేదు.

"మొత్తం చిన్నదేగాని, నువ్వూ డబ్బుకక్కుర్తి

తోనే జానకిని చేసుకుంటానంటున్నావు" అని రాజా అభ్యంతరం చెప్పాడు.

"నాతండ్రీ, మనం డబ్బుకక్కుర్తితోనే ఈ ఇంజనీరింగులో చేరి, ఎంగిలాకుల్లో దొరికేదానికన్నా హీనమైన ఈ హాస్టల్ తిండి తింటున్నాం. నాది డబ్బవసరం గాని ధనదాహం కాదు" అన్నాను.

రాజా స్లీడరుసవాళ్ళు వేశాడు.

"నువ్వు జానకిని ప్రేమించి పెళ్లి చేసుకున్నట్టయినా నటించబోవా?"

"మీ జానకిని ఎవరన్నా ప్రేమించి పెళ్లాడతారన్న నమ్మకం నీ కుందా?"

"జానకి చాలా తెలివిగలది. ఫిజికల్‌గా ఆకర్షణ లేనంతమాత్రాన దాన్ని ఎవరూ ప్రేమించరంటే నేను ఒప్పను."

"మీ జానకిని ఎవరూ ప్రేమించరని నేను అనలేదురా, బాబూ. పెళ్లాడాక నేనే ప్రేమిస్తానేమో. ముందుగా ప్రేమించి పెళ్లాడటం సాధ్యమా అని అడిగాను."

రాజా కాస్సేపు ఆలోచించి, "జానకిమాట అటుంచు. ఎవతెనో ఒకతెను ఎంతో కొంత ప్రేమించి పెళ్లాడాలని నీకు లేదూ?" అని మరో సవాలు వేశాడు.

"చూడు, రాజా. ప్రేమంటే ఏమిటో నాకు తెలీదు. ప్రేమించి పెళ్లాడటం ఘనకార్యమే కావచ్చు. కాని చెల్లెలికి గొప్ప సంబంధం తీసుకురావటంకూడా ఘనకార్యమే. మొదటిది నాకు సాధ్యం అవుతుందన్న నమ్మకం లేదు. రెండోది నా చేతిలో ఉంది. నువేదో సహాయం చేస్తావనుకుంటే, అడ్డప్రశ్నలు వేసి ఎందుకు చంపుకుతింటున్నావ్?" అన్నాను.

రాజా దారికి వచ్చాడు. వార్డెన్ పర్మిషను తీసుకుని శనివారం సాయంకాలం బయలుదేరి నేనూ, వాడూ వాళ్ల బాబుగారి ఊరు వెళ్లాం. లక్షలుంటే ఉన్నాయేమోగాని వాళ్ల ఇల్లుకన్న మా ఇల్లే నయమనిపించేటట్టుగా ఉన్నది.

జానకి విషయం చెప్పటానికేమీ లేదు. కాలు లేకపోవటం ఒకటే లోపంకాదు. ఆ పిల్ల బాగుండదు. కాలున్నాకూడా ఆమెను కట్నంకోసం చేసుకోవలసిందే.

ఆమెను చూశాక, డబ్బుకోసం ఆమెను చేసుకోవటం ఏమాత్రమూ నేరం కాదనిపించింది.

జానకి తల్లి — కంట్రాక్టరుగారి భార్య — గడుసుమనిషి. నేను పెళ్లాడటానికి సిద్ధంగా ఉన్నానన్నాక బెట్టుచేసి, ఆలోచించి చెబుతామన్నది.

"అలా అయితే నేనుకూడా ఆలోచించుకోవలసి వస్తుంది. నాక్కావలసింది పిల్లతోబాటు పదిహేను వేలు కట్నం. పెళ్లి అయిదు రూపాయలతో చేసినా నాకేమీ అభ్యంతరం లేదు. పెళ్లికి మావాళ్లెవరూ రారు. వారం పదిరోజుల్లో పెళ్లి అయిపోతే నాకు వీలుగా ఉంటుంది. ముహూర్తం చూడకపోయినా ఫరవాలేదు" అని నా కాబోయే అత్తగారితో చెప్పాను.

తరవాత రాజా, ఆవిడా లోపలికి వెళ్లి మాట్లాడుకున్నారు. వాళ్ళు బయటికి వచ్చి నేను చెప్పిన షరతులకు సమ్మతించినదాకా జానకి నాకేసి కళ్లార్పకుండా తేరిపారజూస్తూనే ఉంది. ఆమె బుర్రలో ఏమి జరుగుతున్నదో నాకు అంతుపట్టలేదు.

నా పెళ్లి స్థిరమయింది. "నన్ను చేసుకోవటం సి కిష్టమేనా?" అని జానకి అడిగే అవకాశం నాకు దొరికింది, కాని అడగలేదు. "నా [illegible]" అంటుందనీ, ఆ తరవాత నా పని ఇరకాటంలో పడుతుందనీ నా కెందుకో అనిపించింది. నేను తనను ఇష్టం లేకుండానే పెళ్లి చేసుకుంటున్నాను; తనుకూడా నన్ను ఇష్టం లేకుండానే చేసుకుంటున్నదనుకున్నాను.

మా పెళ్లి మరో ఆదివారం జరిగింది. ఈలోపల నాకు వాళ్లు 150 పెద్దనోట్లు ఇచ్చారు. వాటిని బాంకులో వేసుకున్నాను. ఆ రోజే నాన్నకు ఉత్తరం రాసేశాను, సుశీల పెళ్లిప్రయత్నాలు ధారాళంగా చెయ్యమనీ, డబ్బుకు వెనకాడవద్దనీనూ.

నా పెళ్లికి నే నెవర్నీ పిలవలేదు సరేకదా, పెళ్లి చేసుకుంటున్నట్టు ఇంటికి రాయనుకూడా లేదు.

"సుశీ పెళ్లిఖర్చులకు నువే డబ్బు పుట్టించేటట్టుగా అర్థంచేసుకున్నాను. నీదగ్గిర డబ్బు ఎక్కడిది?" అని నాన్న రాసినప్పుడు అసలు సంగతి బయటపెట్టాను. నా పెళ్లి విచిత్రమైన పరిస్థితుల్లో జరిగిపోయింది, నాకు అత్తవారు పదిహేను వేలు కట్నం ఇచ్చారని తెలియబరిచాను. నా భార్య కుంటుతుందనీ, రూపసి కాదనీకూడా రాశాను.


సుశీల నన్ను యుద్దేశిస్తూ ఇంత పొడుగు ఉత్తరం రాసింది. నేను తనకోసమే త్యాగంచేసి సినిమా హీరో పోజు పెడుతున్నానన్నది. మనదగ్గిర శక్తి లేదని స్పష్టంగా చెబితే పెళ్లిఖర్చులు తన కాబోయే అత్తవారే పెట్టుకునేవాళ్లన్నది. ఇంత గోప్యంగా జరిగిన పెళ్లి అదెటువంటి పెళ్లో, అందులో ఎన్ని మహాపాతకాలున్నాయోనని అమ్మ భయపడుతున్నట్టు రాసింది.

నే నా ఉత్తరానికి జవాబు రాశాను. నేను సినిమా హీరో చేసే పని చెయ్యలేదనీ, అచ్చగా నా స్వార్థమే చూసుకున్నాననీ, పదివేలు తండ్రి ఆస్తి తినే హక్కు సుశీల కున్నదనీ, పెళ్లి అయాక నా చదువుకు అవాంతరం రాకుండా ఉండగలందులకు కట్నంకోసం పెళ్లి చేసుకున్న మాట నిజమేననీ సుశీలకు తెలిపాను.

సుశీల పెళ్లిముహూర్తం వేసవిలోనే పెట్టుకున్నారు.

నగిషీ

ఫోటో—ప్రేమ్‌చంద్ గోస్వామి (జయపూర్)



పెళ్లి కాగానే అతను సుశీలను తీసుకుని, హనీమూన్‌కు అమెరికా వెళ్లే పనికూడా పెట్టుకున్నాడు.

కాలేజీ ముయ్యగానే నేను అత్తవారింటికి వెళ్లి నాలుగు రోజులుండి, వాళ్లనుకూడా వెంటబెట్టుకుని, సుశీల పెళ్లికి ఓ వారం ముందుగా ఇంటికి చేరాను.

అప్పుడే నేను జానకిని ఒంటరిగా కలుసుకున్నది. మా శరీరాలు ఏకమైనాయిగాని మనస్సులు ఏకం కాలేదు. జానకి మనస్సు నాకు కనుచూపుమేరలో ఎక్కడా కనిపించలేదు.

"నేనంటే నీకు చాలా అసహ్యమా?" అని జానకిని అడిగాను

"అసహ్యమూ లేదు, ఇష్టమూ లేదు. నేను మిమ్మల్ని చూసి చీదరించుకోలేదే?" అన్నది జానకి.

"అసహ్యంలేనిచోట ఇష్టం ఉంటుంది. ఇష్టంలేని చోట అసహ్యం ఉంటుంది. మొగుడు పెళ్లాలమధ్య నిర్లిప్తత అనేది ఎట్లా సాధ్యమవుతుంది? నాకు మొదట నువ్వంటే అసహ్యంగానే ఉండేది. ఇప్పుడు ఇష్టమవుతున్నావు" అన్నాను.

"నావల్ల డబ్బొచ్చింది. ఇప్పుడు సుఖం వస్తున్నది. అందుచేత ఇష్టంకూడా వస్తున్నదేమో. మా నాన్న సంపాదన పెరిగినకొద్దీ అమ్మకు ఆయనమీద ఎక్కడ లేని ఇష్టమూ పుట్టుకొచ్చింది" అన్నది జానకి.

"నే నిప్పుడు సుఖమిస్తున్నాను గద. ఇంకొన్నాళ్ళు పోయాక మీ నాన్నలాగా లోకులను కొట్టి డబ్బు సంపాదిస్తాను. అప్పుడు నామీద నీకు ఇష్టం వస్తుందా?" అన్నాను.

"మా నాన్నను అనక్కర్లేదు. ఆ పద్ధతిలోనే మీరూ ఆర్జన మొదలుపెట్టారు. ఇవాళ మీ బాంకులో ఉన్న డబ్బు న్యాయంగా సంపాదించినదేనా?" అని జానకి అడిగింది.

"నావల్ల నీకేమీ ఉపకారం జరగలేదా?"

"నన్ను పెళ్లిచేసుకోవటమేనా? నేను పెళ్లికోసం వాచిపోయుండలేదు. మిమ్మల్ని చేసుకుంటే ఎవరో అమ్మాయికి ఉద్ధరింపు అవుతుందని మా రాజా అన్నయ్య అంటే ఈ పెళ్లికి ఒప్పుకున్నాను. ఎప్పటికైనా ఆ అమ్మాయి వచ్చి తన కృతజ్ఞత నాకు చెప్పుకుంటే నేను చేసిన పని వృథాపోలేదు గదా అని సంతోషిస్తాను" అన్నది జానకి.

ఆ రాత్రి కలలో జానకిని నేను మొట్టమొదటిసారి మనసారా ప్రేమించాను. అయితే అందులోకూడా కొంత వంచన ఉన్నది. కలలో జానకి కుంటిదికాదు. అందంగా ఉన్నదేమోకూడాను — నాకామె మొహం కనిపించలేదు.

సుశీల జానకిని చూస్తూనే మొహం చిట్లించింది. అదీ, మా అమ్మాకూడా జానకిపట్ల, మా అత్తగారిపట్ల ఆప్యాయత చూపలేకపోయారు; కులం చెడ్డవాళ్లనూ, పేదబంధువులనూ చూసినట్టు చూశారు.

"మావాడు అవివేకంగా మాకు తెలీకుండా పెళ్లి చేసుకున్నాడు. మీరైనా మాకొక కార్డుముక్క రాసి ఉండవలసింది" అని అమ్మ మా అత్తగారితో అన్నది.

"మీకు మీ అబ్బాయికన్న మేం దగ్గిర బంధువులవుతామని తోచలేదు, వదినెగారూ" అన్నది మా అత్తగారు.

మా సుశీలనుకూడా జానకి కాల్చి వాతపెట్టినట్టుగా

ఇటువంటి మాట ఏదో అన్నట్టుంది, సుశీల నా దగ్గిరి కొచ్చి, "లోకం గొడ్డుపోయినట్టు భలేదాన్ని కట్టుకున్నావు మొత్తానికి!" అన్నది.

"మిగిలిన విషయాలు నాకు తెలీవుగాని, జానకి అభిమానం కలది. అభిమానం ఉన్నవాళ్ళను నేను గౌరవిస్తాను. అదీగాక వాళ్ళు చాలా భాగ్యవంతులు. మనం వాళ్ళను పేదగానూ, హీనంగానూ చూడనక్కర్లేదు. మనని వాళ్ళు పదిసార్లు కొనేగల్రు" అని సుశీలకు జవాబు చెప్పాను.

"డబ్బుండి ఏం లాభం — సంస్కారం లేక పోయాక!" అని సుశీల వెళ్ళిపోయింది.

సుశీల మొగుడూ వాళ్ళ సంస్కారం పెళ్ళిలో బయటపడింది. వాళ్ళెవరూ మమ్మల్ని మనుషులల్లే చూడలేదు. అవమానించారని కాదు, అలక్ష్యం చేశారు. సుశీలనుమాత్రం అందలా లెక్కించారు.

జానకిని పరిచయంచేస్తే సుశీల మొగుడు "గుడ్ హెవెన్స్!" అన్నాడు, షాక్ తిన్నట్టుగా.

పెళ్ళి అవుతూనే సుశీల మొగుడితోసహా వెళ్ళిపోయింది — సిమ్లా, డార్జిలింగ్, ముసోరీ, కాశ్మీర్ వగైరా ప్రాంతాలు పర్యటించి రావటానికి. ఈ పర్యటన ముగుస్తూనే ఇద్దరూ కలిసి అమెరికాకు ప్లేనెక్కారు.

అమెరికా చేరుతూనే సుశీల ఒక ఉత్తరం రాసింది నాన్నకు. ఆ తరవాత మరి ఉత్తరం లేదు.

మళ్ళీ కాలేజీలు తెరిచే టైముకు నేను చదువుకు వెళ్ళాను. జానకీ, వాళ్ళమ్మా వాళ్ళ ఊరు వెళ్ళారు.

నేను ఇంజనీరు నవిపించుకున్నాక ఉద్యోగంకోసం ప్రయత్నించామకాని దొరకలేదు.

జానకి కాపరానికి రానసేసింది. కావలిస్తే నన్నే తను ఇంటవచ్చి ఉండమన్నది. ఒకవేళ ఉద్యోగం దొరికినా నావెంట రానన్నది.

"అయితే నేను ఉద్యోగం చెయ్యవద్దంటావా?" అన్నాను.

"నేనెందుకు వద్దంటాను? మీరు కావలిస్తే చేసుకోండి" అన్నది జానకి.

"నువ్వు రానంటివిగా?" అన్నాను.

"రాను. మీరు ఉద్యోగం చెయ్యటానికి నే నొకతెను తోడుకావాలా ఏం?" అన్నది జానకి.

ఇది ఉత్త అభిమానంకాదు, అతిశయం. ఆ మనిషికి నామీద ఎంత పగ!

"జానకీ, నామీద నీకేదో తీరని కసి ఉన్నది. నేనేం చేశానని? కట్నం తీసుకున్నాననేగా? ఎవడు చేసుకున్నా కట్నం తీసుకునేవాడేగా! మీరు కట్నం పొయ్యటానికి సిద్ధంగా ఉన్నారని మీ అన్న అన్నాడు. అతను అబద్ధ మాడాడా? అటువంటి దేదన్నా ఉంటే చెప్పు. కట్నం తీసుకున్నానంటే ఎందుకు తీసుకున్నానో నీకు తెలును. మీ డబ్బుమీద నాకేమీ కాపీనం లేదు, మీమీద పడి తినటం నాకు చాలా అసహ్యం. ఉద్యోగం సంపాదిస్తాను. ఎవడు చూశాడు? మీ బాకీ వడ్డీతోసహా తీర్చుతానేమో! అప్పుడైనా నావెంట వచ్చి నాతో కాపరం చేస్తావా?" అన్నాను.

"మీమీద నాకేమీ ప్రత్యేకంగా కసిలేదు. నావల్ల తనకు జరిగిన సహాయానికి మీ చెల్లెలు కాస్త కృతజ్ఞత కనబరుస్తుందేమో ననుకున్నాను. కాని అది జరగలేదు. పోనివ్వండి. నాకేమీ విచారం లేదు. మీరంతా స్వార్థం చూసుకునేవారేనేమో. మీరు ఉద్యోగం చెయ్యకుండా ఇంట్లో కూర్చుంటే నాకేమీ అభ్యంతరం లేదు. మీాకు కావలసిన డబ్బు యథేచ్ఛగా ఖర్చుపెట్టుకోండి. నన్ను మీతోబాటు ఊళ్ళు తిరగమంటే అది నావల్ల కాదు. మీరు పౌరుషంకొద్దీ ఉద్యోగం సంపాదిస్తాననీ, పుచ్చుకున్న కట్నం వడ్డీతోసహా చెల్లిస్తాననీ అంటే నేనెందు కభ్యంతరం చెప్పాలి. అందరికీ పౌరుషం ఉండాలిసిందే!" అన్నది జానకి.

వాదనలో తప్పేమీ లేదు. కాని మనిషిలోగాని, మాటలోగాని ఏమాత్రమూ ఆర్ద్రత లేదు.

జానకి ఎండిపోయిన మనిషి.

నేను అత్తవారింటనే ఉండిపోయాను. కాని నాకు ముళ్ళమీద ఉన్నట్టే ఉన్నది. జానకిని వదిలి వెళ్ళితే ఉద్యోగంమీదనే వెళ్ళాలి. మా ఇంటికి వెళ్ళటం ఎందుకో నాకు తప్పనిపించింది. నేనుకూడా ఒక విధమైన ఇల్లరికం అల్లుణ్ణనే అనుకున్నాను. నా డివోషన్‌తో జానకికి హృదయ పరివర్తన కలుగుతుందని కూడా నాకేదో భ్రమ ఉండేది.

మా అత్తగారు నన్ను బాగానే చూసేది. ఆవిడలో ఎండిపోయిన మనిషి లక్షణాలేవీ లేవు. ఆవిడ నా మన స్స్థితి అర్థంచేసుకుని, తన కూతురి మనస్సు మార్చుతుందనికూడా నేను ఆశపడ్డాను. కాని ఆ ఆశకూడా భ్రమే అయింది.

ఈ అంపశయ్య జీవితం ఏడాది గడిపాను. తరవాత నాకు ఉద్యోగం దొరికింది.

"జానకీ, నాకు నాగపూరులో ఉద్యోగం దొరికింది" అన్నాను.

"వెళతారా?" అని అడిగింది జానకి.

"నువ్వు రావా?" అన్నాను.

"ఎందు కిన్నిసార్లు అడుగుతారు? నా కుంటికాలు ప్రపంచమంతా ప్రదర్శించాలా?" అన్నది జానకి.

"నేను వెళ్ళిపోతే నీకు ఏమీ బాధ అనిపించదా?"

"ఈ నాటకం సంభాషణలు మానండి. నేను ఒంటరిగా ఉండగలను. బతికినన్నాళ్ళూ ఒంటరిగా ఉండటానికే సిద్ధమయినదాన్ని కొంతకాలం ఉండలేనా?"

నాక్కూడా మనస్సు విరిగినట్టయింది. నేను బయలుదేరి వెళ్ళిపోయాను. వెళ్ళగానే ఉత్తరం రాశాను. పోస్టను తీసుకున్నాక మళ్ళీ రాశాను. జానకి దగ్గిర నుంచి సమాధానం లేదు.

'ఎందుకు చేసుకున్నా నిటువంటి పెళ్ళి?' అనుకున్నాను. పిచ్చివెధవ్ని! సుశీల పెళ్ళికోసం చేసుకున్నాను. జానకినుంచి దాంపత్యసుఖం కోరి చేసుకోలేదు. ఆ సంగతి జానకికి తెలును. ఆమె దృష్టిలో నేను, తనని ప్రేమించి చేసుకున్నవాడల్లే కనిపించటానికి ప్రయత్నిస్తున్నాను కాబోలు కొంపతీసి!

అదే నిజమైతే జానకి నన్నేం గౌరవిస్తుంది? నేను నా ప్రవర్తన మార్చుకోవాలి.

దాదాపు ఏడాదిపాటు కాపరం చేశాం. జానకి కడుపున ఒక నలుసు పడితే ఈ పరిస్థితి ఇంత అన్యాయంగా ఉండకపోను.

జానకికి ఉత్తరాలు రాయటం మానేసి నెలనెలా నా జీతంలో సగం పంపిస్తూ వచ్చాను. నాన్నకూ, అమ్మకూ ఉత్తరాలు పది, పదిహేను రోజుల కొకసారి రాస్తూవచ్చాను. ఇంటినుంచి వాళ్ళ జవాబులు



కోటి విద్యలు
ఫోటో — కంఠం. వీరయ్య (పేరాల)

రాసేవాడు.

ఒకనాడు నాన్నదగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది. సుశీలా, మొగుడూ వస్తున్నారుట. ఫలాని రోజు వస్తున్నారని నాన్న రాశాడు.

ఒక్కసారి సుశీలను చూడాలని ప్రాణం పీకింది. ఆఫీసులో నాలుగు రోజులు శలవుపెట్టి ఇంటికి వచ్చి వాలాను. సుశీల అనుకున్న రోజుకు రాలేదు. మర్నాడు అంకంత కారులో ఇద్దరూ దిగారు.

సుశీల మారిపోయింది. సినిమాల్లో డబుల్‌రోల్ నటించే నటులుకూడా అంత మారరు. ఇండియాలో అమెరికన్లు కట్టుకునే పొట్టచీరెలాటిది కట్టుకుని, లిప్‌స్టిక్ వేసుకుని, హెర్ డూ చేసుకుని, చెవుల కేవో తగిలించుకుని గుర్తుపట్టరాకుండా ఉన్నది.

బావగారు ప్రతి ప్రశ్నకూ దవడ నిమురుకుంటూ, "యా! యా!" అంటున్నాడు. మన దేశంలో పుట్టిన సంగతి ఇద్దరూ మరిచిపోయినట్టున్నారు.

వాళ్ళు సరిగా పది నిమిషాలున్నారు.

మూర్ఛపోయిన మనిషికి స్పృహ తెప్పించటానికి అష్టకష్టాలూ పడతామే, అదేమోస్తరుగా సుశీలను వెనకటిలాగా చెయ్యటానికి అమ్మ ఏమేమిటో మాట్లాడింది.

"అన్నయ్య నాగపూర్లో ఉద్యోగం సంపాదించాడేవ్!"

"ఓ!" అన్నది సుశీల, నాకేసి ఆశ్చర్యంతోకూడిన నవ్వుతో వింతగా చూస్తూ.

"వాడి పెళ్ళాం పుట్టింటోనే ఉంది. వాడితో కాపరానికి రాదుట" అన్నది అమ్మ.

"ఆహా!" అన్నది సుశీల, గడియారం చూసుకుంటూ.

తరవాత ఇద్దరూ కారెక్కి వెళ్ళిపోయినారు. అమ్మ ఎంత బతిమాలినా వాళ్ళు ఆగలేదు.

ఈ డాక్యుమెంటరీ చూడటానికే నేను ఉద్యోగానికి శలవుపెట్టి ఇన్ని వందలమైళ్ళు వచ్చాను.

మా ఆఫీసులో స్టెనోగ్రాఫరున్నది. నాతో చాలా స్నేహంగా ఉంటుంది. నాకు పెళ్ళాం ఉందని ఆ పిల్లకు తెలును. నాకు కొంచెం ఖర్చు జాస్తిగా ఉండి జానకికి నా జీతంలో సగం పంపించలేకపోతున్నాను.